క్లుప్తంగా

ఒండ్రుమట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

గోపాల్‌పేట: మండలంలోని బుద్ధారంలో మంగళవారం ఒండ్రుమట్టి తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. రిజర్వాయర్ పనులు ప్రారంభం అయ్యాయి కానీ రిజర్వాయర్ పనులు జరిగేందుకు ఎంతమేర తవ్వుతారో.. రిజర్వాయర్ సామర్థ్యం మేరకు ఏ మేరకు మట్టి తరలిస్తారో చెప్పాలని టిప్పర్ల డ్రైవర్లను వివరణ కోరగా వారు స్పందించలేదు. రిజర్వాయర్ పనులు చేసే కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడి బుద్ధారం గ్రామానికి పిలిపించారు. గ్రామానికి వచ్చిన తర్వాత రైతుల సమక్షంలో మాట్లాడారు. రిజర్వాయర్ కెపాసిటీ ఎంత, అందులో ఎంత మేర ఒండ్రుమట్టి తీస్తారు అని అడిగారు. గ్రామ రైతులకు అన్ని విషయాలు చెప్పడంతో పాటు అనుమతులు చూపడంతో గొడవ సద్దుమణిగింది.

బీఎస్పీ బలోపేతానికి కృషి

పెంట్లవెల్లి: బీఎస్పీ మండల అధ్యక్షుడిగా మల్లేశ్వరానికి చెందిన బంకల లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడని జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య అన్నారు. నాపై నమ్మకంతో మండల అధ్యక్షత బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలకు నిత్యం అండగా ఉంటానని, పార్టీకి నిరంతరం కృషి చేస్తానని బహుజన రాజ్యాధికారం కోసమే ముందుకు సాగుతానని తెలియజేశారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

పెంట్లవెల్లి: బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలె భరత్‌ను మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పెంట్లవెల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ముందస్తు అరెస్టులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనం అని, త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.

పెద్దకొత్తపల్లి: సీఎం ఎన్నికల సమయంలో ఇచ్చిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ చేపట్టనందుకే నిరసన చేపట్టామని బీజేపీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏ మొహం పెట్టుకుని సీఎం పర్యటనకు వస్తున్నారని లింగస్వామి అన్నారు. మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్న సీఎంకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ కురుమయ్య తన సిబ్బందితో వచ్చి బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాగరాజు, బాబురావు, శివ, రాజు, లింగస్వామి పాల్గొన్నారు.

ధ్వజస్తంభం, నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠాపన

పెద్దకొత్తపల్లి: జొన్నలబొగుడలో నూతన ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయ విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఇందిర రవినాయక్ తెలియజేశారు. కార్యక్రమానికి కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలియజేశారు.

ధరణి ఆపరేటర్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు



కోడేరు: ధరణి ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా ధరణి ఆపరేటర్లు, కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు, ఉపాధ్యక్షుడిగా కళ్యాణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. జిల్లాలో ధరణి ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం ప్రతినెలా చెల్లించాలని కోరారు.

అభయాంజనేయుడికి పూజలు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆకుతోట అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా అర్చనలు, పంచామృతం, అభిషేకం, సింధూరలేపనం, ఆకుపూజా వంటి కార్యక్రమాలను ఆలయంలో నిర్వహించారు. అనంతరం పలు గ్రామాల నుంచి పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించినట్లు అర్చకులు లోకేశ్వర్‌రావు తెలియజేశారు.

ఘనంగా బోనాల పండుగ

దేవరకద్ర: మండలంలోని బస్వాయపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత పోచమ్మ తల్లికి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు బోనాలతో భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మ దేవాలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేశారు.

చెరువుల పండుగకు ఏర్పాట్లు



అమరచింత పెద్ద చెరువును పరిశీలిస్తున్న అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

వనపర్తి టౌన్: పట్టణానికి నలువైపులా ఈనెల 8న చెరువుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం అందుబాటులో ఉన్న కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లచెరువు, తాళ్లచెరువు, అమ్మచెరువు, మరికుంట చెరువులను అందంగా ముస్తాబు చేసి, ఆయా చెరువుల అభివృద్ధిపై వీడియోలను ప్రదర్శించాలని నిర్ణయించినట్లు తెలిపారు. చెరువులకు సమీపంలో ఉండే ఆయా వార్డుల నుంచి ప్రజలు తరలివచ్చేలా కౌన్సిలర్లు బాధ్యతలు తీసుకునేలా సర్క్యులర్ జారీ చేయాలని సూచించారు. చెరువుల పండుగ సందర్భంగా చెరువు కట్టలపై సామూహికంగా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ విక్రమసింహారెడ్డి, కౌన్సిలర్లు పాకనాటి కృష్ణ, నాగన్నయాదవ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో మాట్లాడుతున్న గట్టుయాదవ్

అమరచింత: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. పట్టణంలోని పెద్ద చెరువును మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలతో సామూహిక భోజనాల ఏర్పాటు కోసం చెరువు పరిసరాలను పరిశుభ్రపరిచే కార్యక్రమాలను యంత్రాల సహకారంతో చేపడుతున్నట్లు వెల్లడించారు. మహిళా సంఘాల సభ్యులతో బతుకమ్మలు, మత్స్యకారులు వలలతో హాజరై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కమిషనర్ మహమ్మద్‌ఖాజా, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.



దొంతికుంటతండా చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఖిల్లాఘనపురం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించే చెరువుల పండుగను ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సూరాయపల్లి, సోళీపురం, దొంతికుంటతండా, మానాజీపేట తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి చెరువుల పండుగ ఏర్పాట్లను పరిశీలించారు.

అప్రమత్తతతోనే క్షయ నివారణ



వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందిస్తున్న సిబ్బంది

అమరచింత: అప్రమత్తంగా వ్యవహరించి తగు ఆరోగ్య సూచనలు పాటించడంతో త్వరితంగా క్షయ నుంచి కోలుకునే అవకాశం ఉందని డాక్టర్ నిస్సార్ అన్నారు. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించారు. ప్రతి నెల క్షయ వ్యాధిగ్రస్తులకు డీఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించడం అభినందనీయం అన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. కేవలం ఆరు నెలల పాటు వైద్యులు సూచించిన ప్రకారం మాత్రలు వేసుకుంటే వ్యాధి నుంచి త్వరితంగా కోలుకునే అవకాశం ఉందన్నారు. వ్యాధిగ్రస్తుల పేర్లు గోప్యంగా ఉంచుతారని, ఇతరులతో మాట్లాడే సమయాల్లో మాస్కులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తిలో మంగళవారం సంపూర్ణ సురక్ష హెచ్‌ఐవీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జోనల్ సూపర్‌వైజర్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దీర్ఘకాలంగా ఆరోగ్య సమస్యలు వెంటాడుతుంటే టెస్టులు చేసుకోవాలన్నారు. సుఖవ్యాధులు, టీబీపై అవగాహన పెంచుకొని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో 30 మంది స్వచ్ఛందంగా టెస్టులు చేయించుకున్నారు. కార్యక్రమంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్లు మహేష్, శివాని, నాగలక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో పునర్జన్మ



అవయదానం చేస్తున్నట్లు సంతకాలు చేసిన పత్రాలను చూపుతున్న యువకులు

ఆత్మకూర్: అవయవాలు పనిచేయక ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అవయదానం చేయడంతో చనిపోయిన వారికి పునర్జన్మ లభిస్తుందని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి, డైరెక్టర్ అంజనారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఆత్మకూర్‌లోని ఎంజీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో వర్కటం పుట్టినరోజు సందర్భంగా జీవన్‌దాన్ అవయవ దాన కేంద్రం నిర్వాహకులు అవయవదానం గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 55 మంది వీజేఆర్ వలంటీర్లు అవయదానం చేసేందుకు పత్రాలపై సంతకాలు చేశారు. వీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మక్తల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.కోట్లు సొంత నిధులను వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా అవయదానం చేసిన యువకులను జీవన్‌దాన్ నిర్వాహకులు, వర్కటం అభినందించారు.

దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు నిధులు కేటాయించాలి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న సర్పంచ్‌లు

పాన్‌గల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జీపీల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్‌ల సంఘం నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే జీపీల్లో చేసిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారని, దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందిస్తూ జీపీల్లో జనాభా ప్రతిపాదికన తహసీల్దార్ ద్వారా ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక నిధులు అందజేస్తామని భరోసా ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం గౌరవ అధ్యక్షుడు బాల్యానాయక్, అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటయ్యయాదవ్, సర్పంచ్‌లు విష్ణునాయుడు, అనిత పాల్గొన్నారు.

‘ఉత్సవాలు నిర్వహించే హక్కు ప్రభుత్వానికి లేదు’



కరపత్రాలు పంచుతున్న ప్రజాపంథా నాయకులు

అమరచింత: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో గ్రామాల్లో సంబురాలు నిర్వహించడం వింతగా ఉందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి హనుమంతు ఎద్దేవా చేశారు. మండలంలోని మస్తీపురం, నందిమళ్ల గ్రామాల్లో పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ మంగళవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ప్రచారం నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. రూ.ఐదు లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల నెత్తిన భారం మోపిందని ఆరోపించారు. కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని చెప్పిన సీఎం కేసీఆర్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయడంలో విఫలమయ్యాడన్నారు. డబుల్ బెడ్‌రూంలు ఇవ్వడంలో ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. రైతులకు రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని మోసం చేశారని, పోడు భూములకు పట్టాలిస్తానని చెప్పి కాలయాపన చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతూనే ఉన్నాడని విమర్శించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను ఇవ్వలేక పోయారని, ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని స్పష్టంచేశారు. బంగారు తెలంగాణ అంటూ అందినంత దోచుకోవడమే బీఆర్ఎస్ ప్రభుత్వానికి పనిగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. దీక్ష దివాస్ సందర్భంగా ఈనెల 8న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని, 12న జిల్లా కేంద్రంలో దీక్ష దివాస్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి రాజు, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న, బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సామేలు, నాయకులు వెంకటేష్, రాజు, మురళి, జనార్దనమ్మ, శైలజ, మహేశ్వరమ్మ, కిష్టమ్మ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనాపురం: ఊకచెట్టు వాగు సమీపంలో మంగళవారం మధ్యాహ్నం మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కొత్తకోట మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి ఆత్మకూరు వైపు నుంచి సొంత గ్రామానికి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. తలకు బలమైన గాయం తగిలి రక్తస్రావం అయింది. చికిత్స నిమిత్తం 108 సహాయంతో వనపర్తి జిల్లా ఆస్పత్రి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఆయన సోదరుడు భీంరెడ్డి తెలిపారు.

ఆత్మకూర్: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. అమరచింతకు చెందిన శ్రీనివాసులు తన కుమారుడితో కలిసి ఆరేపల్లిలో జరిగిన పెద్దమ్మ పండుగకు హాజరై స్వగ్రామానికి పయనమయ్యాడు. ఆత్మకూర్‌లోని పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి బైక్ అదుపు తప్పి పడిపోవడంతో శ్రీనివాసులు తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారం అందించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీనివాసులును జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పోలీస్‌స్టేషన్‌లో ఇరుపక్షాల ఘర్షణ

వనపర్తి: కొద్ది నెలల క్రితం పెళ్లి అయిన ఓ జంట వివాదం వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఘర్షణ వాతావరణం నెలకొనటానికి కారణమైంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సవాయిగూడెం తండాకు చెందిన యువరాణి అనే యువతికి మదనాపురం మండలం నర్సింగాపూర్ తండాకు చెందిన మహేష్ అనే యువకుడితో ఇటీవల పెళ్లి జరిగింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో యువతి పోలీసులను ఆశ్రయించింది. మంగళవారం సదరు యువకుడిని పోలీసులు స్టేషన్‌కు రమ్మని చెప్పటంతో వారు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు తరలివచ్చారు. సీఎం బందోబస్తు కారణంగా స్టేషన్‌లో సిబ్బంది తక్కువగా ఉండటం, ఇరుపక్షాల వారు స్టేషన్‌లో మాట మాటా పెంచుకుని ఘర్షణకు దిగటంతో ఒక్కసారిగా అక్కడ కోలాహలం నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు మరికొందరి సిబ్బందిని రూరల్ పోలీస్ స్టేషన్‌కు పంపించటంతో వారిని స్టేషన్ ఆవరణ నుంచి బయటకు పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

బీజేపీతోనే సుస్థిర పాలన



మాట్లాడుతున్న మాధవరెడ్డి

మదనాపురం: దేశానికి, రాష్ట్రానికి బీజేపీ ద్వారానే సుస్థిర పాలన లభిస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి దంతనూరు మాధవరెడ్డి వెల్లడించారు. మంగళవారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎగ్గని నరసింహులు జన్మదిన సందర్భంగా ఆయా గ్రామాల బీజేపీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ప్రశాంత వాతవరణం నెలకొందని చెప్పారు. ఎన్నికల ముందు తప్పుడు వాగ్దానాలతో ప్రజలకు మభ్యపెట్టేందుకు నాయకులు వస్తున్నారని, అలాంటి నాయకులను ప్రజలు గుర్తించి గుణపాఠం చెప్పాలని కోరారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



చిన్నంబావిలో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మీటర్ రీడర్లు

వనపర్తి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యుత్ శాఖలో కమిషన్ పద్ధతిలో మీటర్ రీడర్‌గా పని చేస్తున్న మహేష్‌గౌడ్ కుటుంబానికి జిల్లాలోని మీటర్ రీడర్లు రూ.41వేల ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం మృతుడి స్వగృహం చిన్నంబావి మండలం అమ్మాయిపల్లికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థికసాయం అందజేసిన వారిలో ట్రాన్స్‌కో అధికారులు, కాంట్రాక్టర్లు ఉన్నారు. కార్యక్రమంలో నరేష్, మాసూమ్, వేణు, రాజు, దశరథం, శివ తదితరులు ఉన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లికి చెందిన కొమ్ము రేవతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఆర్థిక పరిస్థితిని స్థానిక బీఆర్ఎస్ నాయకులు మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి తక్షణ సహాయం కింద రూ.5వేలు పంపించారు. ఆ నగదును బీఆర్ఎస్ నాయకులు మంగళవారం బాధితురాలి ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాములు, రాజుగౌడ్, సురేష్, తిరుపతి, గజ్జరాములు, శ్రీను, తిరుమలేష్, వెంకటయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

సీఎం సభకు ఆర్టీసీ బస్సులు

- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



బోసిపోయిన వనపర్తి బస్టాండ్

వనపర్తి టౌన్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే సీఎం కేసీఆర్ సభకు వనపర్తి ఆర్టీసీ డిపో నుంచి మంగళవారం 50బస్సులు వెళ్లాయి. దీంతో రోజువారీగా ఆయా సమయాల్లో బయలుదేరాల్సిన బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే హైదరాబాద్‌కు గంటకు ఒక బస్సు పైగా కేటాయించారు. మిగతా ముఖ్యమైన ప్రాంతాలకు సైతం బస్సులు ఏ సమయంలో వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. బస్సులన్నీ అధిక శాతం సీఎం సభకు తరలి వెళ్లడంతో విచారణ కౌంటర్‌లో బస్సుల సమయ వేళలు ప్రచారం చేసే అధికారులు సైతం ప్రయాణికులకు సమాచారం చేరవేయడం నిలిపివేశారు. డిపోలో 105కు పైగా బస్సులు ఉంటే అందులో 50కి పైగా బస్సులు సీఎం సభకు కేటాయించడంతో వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ద్వారా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురయ్యారు.

ఘనంగా పెద్దమ్మతల్లి దేవర్లు



రేచింతలలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూర్: గ్రామ దేవత పెద్దమ్మతల్లి దేవర్లను రేచింతల, ఆరేపల్లి గ్రామాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ శివారులోని పెద్దమ్మ, పోచమ్మ ఆలయాల వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈసందర్భంగా గొర్రెలను బలి ఇచ్చి నైవేద్యంగా సమర్పించారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆలయంలో పూజలు చేసి, గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో వేలాది సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. పూజల్లో ఎంపీపీ బంగారుశ్రీను, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ అనసూయ, యుగేందర్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయకుల పూజలు..

రేచింతల, ఆరేపల్లి గ్రామాల్లో మంగళవారం జరిగిన పెద్దమ్మతల్లి దేవర్లలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సర్కార్ బడుల బలోపేతానికి కృషి



వెంగళాయిపల్లిలో ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులు

పాన్‌గల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిస్తూ వాటి బలోపేతానికి తోడ్పాటునందించాలని హెచ్‌ఎంలు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వెంగళాయిపల్లి, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సాగుతుందన్నారు. ‘మన ఊరు–మన బడి’ కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులను కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు, దుస్తులు అందిస్తున్న విషయంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకటేష్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, సీఆర్పీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో..

పెబ్బేరు: పట్టణ కేంద్రంతో పాటు మండలంలో రంగాపూర్, బునాదిపూర్ గ్రామాల్లో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, ఉచిత భోజనం, దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు అన్ని వసతులు కల్పిస్తుందని, తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు రాధమ్మ, ప్రభావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..

బడిఈడు పిల్లలందరూ చదువుకోవాలి..

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేలా చూడాలని ఎంఈఓ ఉషారాణి, జిల్లా కోఆర్డినేటర్లు శేఖర్, యుగేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉపాధ్యాయులు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే వసతులపై అవగాహన కల్పించాలన్నారు